ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 332 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 10 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి





# ఛాంపియన్ టీమిండియా!

*ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా టీమిండియా నిలిచింది. కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో సత్తా చాటిన వేళ.. బౌలర్లు ప్రత్యర్థిని 251 పరుగులకే కట్టడి చేసిన వేళ.. భారత జట్టు మరోసారి ఐసీసీ ట్రోఫీని ఖాతాలో వేసుకుంది. భారత్, న్యూజిలాండ్ ఐసీసీ ఫైనల్స్‌లో తలపడిన గత రెండు పర్యాయాలు.. కివీస్‌దే పై చేయి కాగా.. ఈ సారి రోహిత్ శర్మ సారథ్యంలో టీమిండియా ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా టైటిల్‌ను సొంతం చేసుకుంది.*

**న్యూఢిల్లీ, మార్చి 9 (ప్రభాత ఉదయం):** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని భారత్ గెలుచుకుంది. ఫైనల్లో న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 252 పరుగుల విజయలక్ష్యంతో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ కు.. కెప్టెన్ రోహిత్ శర్మ ఫ్లై ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. శుభమన్ గిల్‌తో కలిసి తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని ఇచ్చాడు. అయితే ఆ తర్వాత స్పీడ్ బ్రేకర్లు ఎదురయ్యాయి. కోహ్లీ ఒక్క పరుగుకే ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. ఆ తర్వాత 76 పరుగులు చేసిన రోహిత్ శర్మ కూడా పెవిలియన్ చేరుకున్నాడు. 122 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినట్లయింది. తర్వాత శ్రేయస్ అయ్యర్, అక్షర పటేల్ ఆవేశపడకుండా నిలకడగా ఆడారు. స్కోరును 180 దాటించిన తర్వాత ఇద్దరూ షాట్లకు ప్రయత్నించడంతో కొద్ది తేడాతో పెవిలియన్ చేరారు. కానీ విజయం ముంగిటకు టీమిండియాను చేర్చారు.
కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా తర్వాత కివీస్ జట్టుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. విజయానికి కావాల్సిన పరుగులు వేగంగా పూర్తి చేసే ..మిగతా 2లో

### ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి
# కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు
## సీఎం రేవంత్ రెడ్డి



**ఆసిఫాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం):** 'తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలకపాత్ర. తెలంగాణ ఉద్యమం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ ఎన్నో త్యాగాలు చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం నీడ లేని వాళ్లకు తన ఇల్లును ఇచ్చారు కొండా లక్ష్మణ్ బాపూజీ. నీడనిచ్చిన ఆయనను తెలంగాణ వచ్చిన తర్వాత నిలువనీడ లేకుండా చేశారు కొందరు. కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే మాజీ సీఎం కనీసం చూసేందుకు కూడా వెళ్లలేదు. టెక్స్‌టైల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కూడా పెడతాం.' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 8వ పద్మశాలీల మహాసభకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి హాజరయ్యారు. అనంతరం ఆయన సభలో మాట్లాడారు.
బీసీ రిజర్వేషన్ల పెంపు కత్తి ప్రధాని మోదీ మెడకు చుట్టుకుంటుందని బీజేపీ నేతల భయపడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తప్పు ఎక్కడ జరిగిందో నిరూపించమంటే ఎవరూ ముందుకు రావట్లేదని అసహనం వ్యక్తం చేశారు. కులగణన నచ్చనివారు సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 1939లో జరిగిన కులగణన ఇప్పటివరకు మళ్లీ జరగలేదన్నారు. మండల్ కమిషన్ వేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచింది కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. భారత్ ..మిగతా 2లో

### 11న బీఆర్ఎస్ శాసనసభా పక్ష
# సమావేశం
## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్!



**హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం):** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈనెల 11న (మంగళవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరగనున్న సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాలేదు. గత బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజు ..మిగతా 2లో

### 16న స్టేషన్ ఘన్‌పూర్‌కు
# సీఎం రేవంత్ రెడ్డి



## రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
## ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం, అధికారులు

**హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం):** సీఎం రేవంత్ రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 16న రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు రూ.800 కోట్లతో వివిధ పనులు ప్రతిపాదించగా.. వాటన్నింటికీ సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా శ్రీకారం చుట్టనున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం చేతులమీదుగా శంకుస్థాపనల ..మిగతా 2లో

### ప్రతీకార దాడులతో
# రగిలిపోతున్న సిరియా
## 1000 మంది మృతి
## మహిళలను నగ్నంగా ఊరేగించి..
## సిరియాలో ఉద్రిక్త పరిస్థితులు..



**న్యూఢిల్లీ, మార్చి 9 (ప్రభాత ఉదయం):** సిరియాలో సాయుధులు– మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘటనలో ..మిగతా 2లో

# ఎమ్మెల్సీగా విజయశాంతి
## అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్



**హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం):** ఉదయం నుంచి జరుగుతున్న చర్చలు పూర్తి అయ్యాయి. తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసింది. ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయించింది. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌కు అవకాశం ఇచ్చారు. విజయశాంతి చాలా సైలెంట్‌గా తన పేరు లిస్ట్‌లో చేర్చుకునేలా చేశారు. ఈ మధ్యే ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన విజయశాంతి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం చేసిన త్యాగాలు గురించి చెప్పుకొచ్చారు. ఎన్నికలకు ముందు విజయశాంతి కాంగ్రెస్ పార్టీలో చేరినా ఇప్పటి వరకు ..మిగతా 2లో



### ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో
# ఒక మృతదేహం వెలికితీత

**హైదరాబాద్, మార్చి 9 (ప్రభాత ఉదయం):** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నుంచి మృతదేహం వెలికితీసి.. బయటకు తీసుకువచ్చింది రెస్క్యూ టీమ్. మృతుడు ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా అనుమాని స్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలించారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన స్పాట్‌లో తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 16 రోజుల నుంచి రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. టన్నెల్ ఎండ్‌పాయింట్‌లో కేరళ కెడావర్ డాగ్స్ రెండు ప్రదేశాలను గుర్తించాయి. దాంతో.. ఆయా ప్రదేశాల్లో ..మిగతా 2లో



## ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి
# కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

మొదటి పేజీ తరువాయి...

జోడో యాత్రలో బలహీన వర్గాల కష్టాలను రాహుల్ గాంధీ చూశారని తెలిపారు.

కులగణన చేసి జనాభా దామాషాలో బీసీలకు న్యాయం చేయాలనేది రాహుల్ గాంధీ ఆశయమని చెప్పారు. లక్ష మంది ఎన్యుమరేటర్లను నియమించి పకడ్బందీగా కులగణన నిర్వహించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. సోలాపూర్‌లో మార్కండేయ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ రూ.కోటి ఇస్తోందని, అలాగే పద్మశాలి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు.

### నేతన్నలకు 1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లు

రైతన్నలకు ఇస్తున్న ప్రాధాన్యతను నేతన్నలకు కూడా ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తనను ఆశీర్వదించిన కుటుంబాలకు ఏదైనా చేయాలనే తపనతో ఉన్నానన్నారు. తనను గుండెల్లో పెట్టుకుంటున్న మీ రుణం తీర్చుకుంటానని సీఎం మాటిచ్చారు. నేతన్నలకు ప్రభుత్వ ఆర్డర్లను రద్దు చేసిన అప్రతిష్ట ఉండొద్దని భావించానన్నారు. మహిళా సంఘాల్లోని వారికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. 1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లను రాష్ట్ర నేతన్నలకు ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీగా విజయశాంతి

మొదటి పేజీ తరువాయి...

తనను పట్టించుకోవడం లేదని ఆమె ఫీల్ అవుతున్నారు. అసెంబ్లీలో కానీ పార్లమెంట్ ఎన్నికల్లో కానీ టికెట్ ఇవ్వలేదు. ఆమెను ప్రచార కార్యక్రమాల్లో కూడా పాల్గోనివ్వలేదు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన తర్వాత కూడా ఆమె యాక్టివ్‌గా లేకుండా పోయారు. ఆమె ఫేడవుట్ అయ్యారని అంతా అనుకున్నారు. సోషల్ మీడియాలో అప్పుడప్పుడూ హాట్ కామెంట్స్ చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఢిల్లీ పెద్దలను ఒప్పించి ఎమ్మెల్సీ టికెట్ తెచ్చుకున్నారు.

మొదటగా తల్లి తెలంగాణ అనే పార్టీ పెట్టిన విజయశాంతి తర్వాత చాలా పార్టీలు మారారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, కాంగ్రెస్ నుంచి బీజేపీ, బీజేపీ నుంచి గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలోకి మారు. ఇదే ఆమెకు పెద్ద మైనస్‌గా చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మెదక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓసారి గెలిచారు. ఆ తర్వాత ఆ పార్టీకి, కేసీఆర్‌కు దూరమయ్యారు. తెలంగాణ ఇస్తే కాంగ్రెస్ లో చేరతానని ప్రకటించారు. తెలంగాణ ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓసారి మెదక్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు.

అద్దంకి దయాకర్ తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆయనకు 2023లో టికెట్ దక్కలేదు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశారు. మునుగోడు నియోజకవర్గం చండూరులో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభలో కోమటిరెడ్డి సోదరులను ఉద్దేశించి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పార్టీలో ఉంటే ఉండు.. లేకపోతే లేదన్నట్లుగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఆయన వాడిన పదాలపై పార్టీలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆయనపై కోమటిరెడ్డి అభిమానులు టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి ఫిర్యాదు చేశారు. ఆయనకు పార్టీ షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై స్పందించిన దయాకర్ ఏదో ఆవేశంలో నోరు జారి అలా మాట్లాడానని తాను వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. వెంకట్ రెడ్డికి వ్యక్తిగతంగా బేషరతుగా క్షమాపణలు చెప్పారు.

## ప్రతీకార దాడులతో
# రగిలిపోతున్న సిరియా

మొదటి పేజీ తరువాయి...



1000కిపైగా మంది మరణించారు. అనేక ప్రాంతాల్లో మహిళలను వీధుల్లోకి ఈడ్చుకొచ్చి, నగ్నంగా ఊరేగించి, కాల్చి చంపేశారు! దశాబ్ద కాలంగా అల్లకల్లోలాలు, రక్తపాతానికి కేరాఫ్ అడ్రెస్‌గా మారిన సిరియా.. హింసాత్మక ఘర్షణలతో మళ్లీ అట్టుడుకుతోంది. మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మద్దతుదారులు– భద్రతా దళాల మధ్య రెండు రోజులు పాటు సాగిన ఘర్షణల్లో 1000కిపైగా మంది మరణించారు. ఈ పరిస్థితుల మధ్య అనేక నగరాల్లోని వీధులపై మృతదేహాలు కనిపిస్తున్నాయి. ఈ హింసకు ముగింపు పడిందని అధికారులు చెబుతున్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా ఆందోళకరంగానే ఉన్నట్టు సమాచారం.

### సిరియాలో తాజా హింసకు కారణాలు..

సిరియాలో ఇటీవలే అధికారం మారిన విషయం తెలిసిందే. కాగా మాజీ అధ్యక్షుడు బషర్ అసద్‌కి నమ్మకస్తులుగా పేరు సంపాదించుకున్న మైనారిటీ అలవైట్ ప్రజలను ఇప్పుడు టార్గెట్ చేశారు. ఆ అలవైట్‌లకు అసద్ పాలనలో అనేక పవర్స్ ఉండేవి. అనేక టాప్ ర్యాంకుల్లో వారు ఉండేవారు. చాలా విశాలవంతమైన జీవితాలు గడిపినవారు కూడా ఉన్నారు.

కానీ సిరియాలో అధికారం మారడంతో అలవైట్‌ల పరిస్థితి ఒక్కసారిగా తారుమారైంది. మూడు నెలలుగా వీరిపై 'ప్రతీకార' దాడులు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే గురువారం వీరిపై సాయుధులు అనేక ప్రాంతాల్లో కాల్పులకు తెగబడ్డారు.

సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమెన్ రైట్స్ ప్రకారం.. తాజా హింసాకాండలో 745మంది పౌరులు మరణించారు. 125మంది ప్రభుత్వ భద్రతా దళాలు, అసద్‌తో సంబంధం ఉన్న మిలిటెంట్ గ్రూప్‌నకు చెందిన 148మంది మృతిచెందారు.

హింసకు తాత్కాలికంగా ముగింపు పడిందని అధికారులు చెబుతున్నారు. హింసాకాండ చెలరేగిన అనేక ప్రాంతాలు ఇప్పుడు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్టు స్పష్టం చేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే రోడ్లను మూసివేసినట్టు వివరిస్తున్నారు.

కానీ సిరియాలోని అనేక చోట్ల పరిస్థితులు ఇప్పటికి ఆందోళనకరంగా, ప్రజల జీవితాలు దయనీయంగానే ఉన్నట్టు అబ్జర్వేటరీ చెప్పింది. అలవైట్‌లు అధికంగా ఉండే లటకియా నగరంలో హింస చెలరేగిందని, దానితో పాటు విద్యుత్– మంచి నీటి సరఫరా కూడా నిలిచిపోయిందని పేర్కొంది.

వీటితో పాటు అనేక ఇళ్లు దోపిడీకి గురయ్యాయని, అనేక నివాసాలకు దుండగులు నిప్పంటించారని తెలుస్తోంది.

ఈ పరిస్థితుల మధ్య భయంతో బిక్కుబిక్కుమంటు బతకడం కంటే ఇళ్లు విడిచిపెట్టి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న కొందరు అలవైట్‌లు సిరియాని వదిలి లెబనాన్‌కి వలస వెళ్లిపోతున్నారు.

### మహిళలను నగ్నంగా ఊరేగించి..

హింసతో కొట్టుమిట్టాడుతున్న సిరియా నుంచి మరిన్ని ఆందోళనకర వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. మహిళలను ఇళ్ల నుంచి లాక్కొచ్చి, వారిని నగ్నంగా చేసి వీధుల్లో ఊరేగించారని, ఆ తర్వాత వారిని కాల్చి చంపేశారని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

బనియస్ అనే పట్టణంలో అనేక మృతదేహాలు రోడ్ల మీద పడి ఉన్నాయి. కొన్ని శవాలు ఇళ్ల పైకప్పు మీద వేలాడుతూ కనిపించాయి.

"చాలా బాధాకరం! మృతదేహాలు వీధుల్లో ఉండిపోయాయి. ఆయుధాలు పట్టుకున్నవారు మాత్రం.. మృతులకు అంత్యక్రియలు చేయడానికి ఒప్పుకోవడం లేదు," అని ఒక స్థానికుడు మీడియాకు చెప్పాడు.

# ఛాంపియన్ టీమిండియా!



మొదటి పేజీ తరువాయి...

ప్రయత్నం చేశారు. విజయానికి 15 బంతుల్లో 11 పరుగులు చేయాల్సిన సమయంలో హార్దిక్ పాండ్యా.. భుజాల వరకూ వచ్చిన బంతిని బుక్ చేయబోయాడు కానీ వర్కవుట్ కాలేదు. గాల్లోకి ఎగరడంతో బౌలర్ జామిసన్ పట్టుకున్నాడు.దాంతో ఆరో వికెట్ పడింది. తర్వాత క్రీజన్ లోకి జడేజా వచ్చాడు. కంగారు పడకుండా..రాహుల్ తో కలిసి మిగిలిన పరుగులు పూర్తి చేశాడు.

ఛేజింగ్ లో టీమిండియా ఎక్కడా తడబడలేదు కానీ.. ఫైనల్ మ్యాచ్ కావడంతో కొన్ని కోట్ల ఒత్తిడికి గురవుతారేమోనన్న ఆందోళన కనిపించింది. కానీ అలాంటిదేమీ లేకుండా.. విజయం దిశగా సాఫీగా సాగిపోయారు. అంతకు ముందు టాస్ గెల్చినా బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టు.. శుభారంభం లభించినా.. ఆ టెంపోను కొనసాగించలేకపోయింది. భారత ఫీల్డింగ్ పేలవంగా ఉంది. కొన్ని సింపుల్ క్యాచ్‌లు వదిలేశారు. అయినా కివీస్ ప్లేయర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. డారిల్ మిచెల్, బ్రాస్ వెల్ అర్ధసెంచరీలు చేయడంతో%ా% స్కోరు 250 దాటింది. భారత బౌలర్లలో కుల్ దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి రెండేసి వికెట్లు తీశారు. సెమీ ఫైనల్‌లో సెంచరీలు చేసిన రచిన్ రవీంద్ర, కేన్ విలియమ్సన్ పెద్దగా రాణించలేకపోయారు.

భారత్ మూడో సారి చాంపియన్స్ ట్రోఫీని గెలిచింది. ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్తాన్ ఆతిథ్యం ఇచ్చింది. కానీ భారత్ ఆ దేశానికి వెళ్లి ఆడేందుకు ఆసక్తి చూపించలేదు. దాంతో భారత్ మ్యాచ్లను దుబాయ్ లో నిర్వహించారు. పాకిస్తాన్ గ్రూప్ దశ నుంచి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## అసాధారణ మ్యాచ్.. అపూర్వ విజయం: ప్రధాని మోదీ

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని భారత్ కైవసం చేసుకుంది. 12 ఏళ్ల తర్వాత ఈ టైటిల్ సాధించింది. దీంతో దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. టీమ్‌ఇండియా విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "అసాధారణ మ్యాచ్.. అపూర్వ విజయం" అంటూ పేర్కొన్నారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని మన జట్టు కైవసం చేసుకోవడం గర్వంగా ఉందని ట్వీట్ చేశారు. టోర్నమెంటు సాంతం అద్భుతంగా ఆడారంటూ జట్టు సభ్యులను ప్రశంసించారు. మరోవైపు, 'వన్ టీమ్.. వన్ డ్రీమ్.. వన్ ఎమోషన్' అని పేర్కొంటూ బీసీసీఐ మ్యాచ్ ఫొటోలను షేర్ చేసింది.

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని మూడు సార్లు గెలిచిన ఏకైక జట్టుగా భారత్ నిలిచింది. టీమ్‌ఇండియాకు శుభాకాంక్షలు – రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

'స్మాషింగ్ విక్టరీ'.. భారత జట్టులోని ప్రతి ఒక్కరూ కోట్లాది మంది హృదయాలను గర్వంతో ఉప్పొంగేలా చేశారు – కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

చరిత్ర సృష్టించిన విజయమిది. భారత క్రీడాకారుల అద్భుతమైన సామర్థ్యం, మైదానంలో తిరుగులేని ఆధిపత్యం దేశాన్ని గర్వపడేలా చేసింది. – కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

టీమ్‌ఇండియా తన అత్యుత్తమ ప్రదర్శనతో మరోసారి మనల్ని గర్వపడేలా చేసింది. కృషి, అంకితభావంతో అద్భుతమైన విజయం సాధించిన జట్టుకు అభినందనలు – ఏపీ సీఎం చంద్రబాబు

మ్యాచ్ చివరివరకు పోరాట స్ఫూర్తి కనబర్చే న్యూజిలాండ్ జట్టుపై భారత్ అద్భుతమైన ఆటతో విజయం సాధించింది. టీమ్‌ఇండియాకు వరుసగా ఐసీసీ ట్రోఫీలు అందించిన రోహిత్ శర్మకు అభినందనలు. – ఐసీసీ ఛైర్మన్ జైషా

ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ గెలవడం ఆనందంగా ఉంది. అద్భుత ఆట తీరుతో మన జట్టు మరోసారి సత్తా చాటింది – తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

టీమ్‌ఇండియా మైదానంలో నైపుణ్యాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రోహిత్ శర్మ జట్టును ముందుండి నడిపించారు. – మంత్రి నారా లోకేశ్



## 16న స్టేషన్ ఘన్‌పూర్‌కు
# సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు..

అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే కడియం వివిధ ప్రపోజల్స్ పెట్టారు. ఇందులో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటన్నింటినీ దాదాపు రూ.800 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

### వంద పడకల ఆస్పత్రి..

ఇందులో ప్రధానంగా నియోజకవర్గ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో వంద పడకల ఆసుపత్రి, జఫర్‌గడ్ మండలం కోనాయిచలం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీసెస్ కాంప్లెక్స్, విద్యుత్ డివిజన్ ఆఫీస్, 5 సబ్ స్టేషన్లకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు.

### 24 అభివృద్ధి పనులు..

నియోజకవర్గంలోని మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన రోడ్లతో పాటు నూతనంగా ఏర్పడిన చిల్పూర్, వేలేరు మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు, ఆయిల్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్, బంజారా భవన్, ఐటీడీఏ రోడ్డు పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. ఇలా మొత్తంగా రూ.800 కోట్లతో 14 శాఖలకు సంబంధించిన 24 అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు.

### భారీ బహిరంగ సభ..

నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు పూర్తయిన తరువాత.. భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. పొలిటికల్ మైలేజ్ వచ్చేలా దాదాపు 40 వేల మందితో సభ సాగించేందుకు సన్నద్ధమవుతున్నారు.

### శివునిపల్లి శివారులో ఏర్పాట్లు..

ఈ మేరకు బహిరంగ సభ నిర్వహణకు స్టేషన్ ఘన్‌పూర్ సమీపంలో పాలకుర్తి%-%ఘన్‌పూర్ రోడ్డులోని శివునిపల్లి శివారులోని స్థలాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. దాదాపు 30 ఎకరాల మేర స్థలం ఉండగా.. సభా స్థలాన్ని ఖరారు చేసి ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆఫీసర్లకు సూచించారు.

# అమెరికాలో హిందూ దేవాలయంపై దాడి

### బాప్స్ స్వామినారాయణ్ టెంపుల్‌పై గ్రాఫిటీ రాతలు

### ఎఫ్‌బీఐ విచారణకు హిందూ అమెరికన్ ఫౌండేషన్ డిమాండ్.. నీచమైన చర్యగా అభివర్ణించిన భారత్

**కాలిఫోర్నియా, మార్చి 10 (ప్రభాత ఉదయం):** అమెరికాలోని ఓ హిందూ దేవాలయంపై దాడి జరిగింది. కాలిఫోర్నియాలోని చినో హిల్స్ బాప్స్ స్వామినారాయణ్ మందిరంపై భారత్‌కు వ్యతిరేకంగా విద్వేషపు రాతలను రాశారు. గ్రాఫిటీ గ్రూప్ ఈ మందిరంపై విద్వేషం నింపేలా రాతలు రాసింది. అమెరికాలో మరో హిందూ టెంపుల్‌పై ఇలాంటి దాడే ఐదు నెలల క్రితం జరిగింది. కాగా బాప్స్ ఈ ఘటనపై స్పందించింది. హిందూ సమాజం ఈ విద్వేషానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడుతుందని తెలిపింది. చినో హిల్స్, సదరన్ కాలిఫోర్నియా కమ్యూనిటీ కలిసి ఈ విద్వేషాన్ని పాతుకపోకుండా చూస్తాము. మన ఉమ్మడి మానవత్వం, విశ్వాసం తప్పకుండా శాంతిని కోరుకుంటాయని బాప్స్ సోషల్ మీడియాలో పేర్కొంది.

బాప్స్ స్వామినారాయణ్ మందిరంపై 'హిందూస్ గో బ్యాక్' అంటూ గ్రాఫిటీ రాతలు రాశారు. కాగా, ఈ ఘటనపు హిందూస్ ఇన్ నార్త్ అమెరికా సంస్థ ఖండించింది. మీడియా, మేధావులు అసలు హిందూ వ్యతిరేకత లేదని, హిందూ ఫోబియా అనేది కేవలం ఊహా జనితమే అని ప్రచారం చేస్తాయి. కానీ ఇలాంటి సంఘటనలు వారికి కనపడవు అని హిందూస్ ఇన్ నార్త్ అమెరికా పేర్కొంది. 2022 నుంచి ఇప్పటి వరకు 10 హిందూ మందిరాలపై దాడి జరిగిందని తెలిపారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ విచారణ జరపాలని హిందూ అమెరికా ఫౌండేషన్ డిమాండ్ చేసింది. పవిత్రమైన స్థలాల్లో యాంటీ హిందూ రాతలపై కఠినంగా వ్యవహరించాలని



కోరారు.

అమెరికాలో హిందూ దేవాలయంపై దాడిని భారత ప్రభుత్వం ఖండించింది. కాలిఫోర్నియాలోని హిందూ దేవాలయంపై జరిగిన దాడి వార్తలను చూశాం. ఇలాంటి నీచమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రార్థనా స్థలాలకు తగిన భద్రత కల్పించాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 11న బీఆర్ఎస్ శాసనసభా పక్ష
# సమావేశం

అసెంబ్లీకి హాజరై ఆ తర్వాత మళ్లీ అడుగుపెట్టలేదు.

### బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ రావడం ఖాయం

ఈ నెల 12 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాలకు మాత్రం హాజరుకావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ నేతలకు తెలియజేసినట్లు సమాచారం. పార్టీ శాసనసభ పక్ష సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటన రావడంతో కేసీఆర్ అసెంబ్లీకి రావడం ఖాయమైనట్లేనని తెలుస్తోంది. ఒకవేళ కేసీఆర్ బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకపోతే ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లోనే శాసనసభా పక్ష సమావేశం జరిగేదని పార్టీ నేతలు చెబుతున్నారు.

### అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం

బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకే కేసీఆర్ హైదరాబాద్ వస్తున్నారని.. అందుకే ఇక్కడే పార్టీ ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్‌ను ఎండగడుతారని చర్చ సాగుతోంది.

### 12 నుంచి బడ్జెట్ సమావేశాలు మొదలు

12వ తేదీ నుంచి మొదల్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27 వరకు జరిగే అవకాశం ఉంది. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మరుసటి రోజు రెండు సభల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలుపుతారు. కానీ, బడ్జెట్ ఏ రోజు ప్రవేశ పెడుతారు, పద్దులపై ఎన్ని రోజులు చర్చిస్తారు అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో
# ఒక మృతదేహం వెలికితీత

మొదటి పేజీ తరువాయి...

ర్యాట్ హెూల్ మైనర్లు తవ్వకాలు చేపట్టారు. ఈ తవ్వకాలు పూర్తికావస్తుండడంతో కార్మికుల ఆనవాళ్లు లభ్యమైనట్లు తెలుస్తోంది. తాజాగా ఒక మృతదేహాన్ని వెలికితీశారు. మిగతా ఏడుగురికి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇక.. టన్నెల్‌లో భారీగా పేరుకు పోయిన బురదను తొలగించేందుకు రెండు మినీ జేసీబీలను వినియోగిస్తున్నారు. టీబీఎం మెషీన్ శకలాల తొలగింపు ప్రక్రియ వేగంగా కొనసాగిస్తున్నారు. కన్వేయర్ బెల్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో.. దాని ద్వారా శిథిలాలను ఎప్పటికప్పుడు బయటకు పంపుతున్నారు.

### జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌కు

# కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి










ఇంద్రా పార్కు ధర్నా చౌక్ వద్ద తమ సంస్థకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలంటు ఉద్యోగులు, పెన్షనర్లు చేస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపి మాట్లాడుతున్న బీ ఆర్ ఎస్ నేత పి. కార్తీక్ రెడ్డి

**ఇంద్రా పార్కు వద్ద ఆ సంస్థ అకాడమిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, పెన్షనర్లు ఒక రోజు నిరసన**

**సంగీబావం తెలిపిన రాజకీయ పార్టీల నాయకులు పి. కార్తీక్ రెడ్డి, ఎస్ ఎస్ ఆర్ ఎ ప్రసాద్, డీజీ నరసింహ రావు లు**

బుద్వేల్, మార్చి 9(ప్రభాత ఉదయం): భారత దేశ గ్రామీణాభివృద్ధికి బాటలు వేస్తూ , గ్రామ సీమల అభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించి, జాతీయస్థాయిలో ఎంతో పేరు తెచ్చుకున్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, పంచాయితీ రాజ్ (ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్) సంస్థను నిర్వీర్యం చేయడానికి 2025 – 26 వార్షిక బడ్జెట్లో ఆ సంస్థకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పి. కార్తీక్ రెడ్డి అన్నారు. తమ సంస్థకు నిధులు కేటాయించాలంటూ ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ కు చెందిన ఉద్యోగులు, పెన్షనర్లు ఆదివారం నగరంలోని ఇంద్రా పార్కు వద్ద ఒక రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. అకాడమిక్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ జ్యోతి సత్యపాలన్, డాక్టర్ సి ధీరజ, డాక్టర్ రాజేష్ కుమార్ సిన్హా, డాక్టర్ ఖతిరేశన్, డాక్టర్ పల్లా అనూరాధ, డాక్టర్ ఎం వి రవిబాబు ల నాయకత్వం లో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండు సాధనలో తాను ఎల్లవేళలా అండగా ఉంటానని కార్తిక్ రెడ్డి భరోసా కల్పించారు. తపాలా శాఖ (సిఐటియు) ఉద్యోగ సంఘం నాయకులు ఎస్ ఎస్ ఆర్ ఎ ప్రసాద్ మాట్లాడుతు, ఎన్ ఐ ఆర్ డి పీ ఆర్ ను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనతోనే కేంద్ర ప్రభుత్వం ఈ దుశ్చర్యకు పాల్పడుతుందని విమర్శించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్ ఐ ఆర్ డీ పీ ఆర్ ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డీజీ నరసింహా రావు, సంస్థ ఉద్యోగులు, పెన్ష నర్లు




నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు, పెన్షనర్లు

మహామూద్ అలీ, డి. రామకృష్ణ, ఏ పరశురాముడు, సుశీల్ కుమార్, డి సరోజ, ఎన్ జంగయ్య, మురళి లు పాల్గోన్నారు.



మహిళా దినోత్సవం జరుపుకుంటున్న ఐద్వా ప్రతినిధులు

# మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం

రాజేంద్రనగర్, మార్చి 9(ప్రభాత ఉదయం) స్త్రీ సమానత్వం కోసం పోరాటం చేద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రంగారెడ్డి జిల్లా ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు ఎం విజయ అన్నారు. రాజేంద్రనగర్ మండలం ఎస్ రామ్మోహన్రావు ఎస్ మోహన్ అధ్యక్షతన రెండు బస్తిలలో శివరాంపల్లి, ఓల్డ్ బుద్వేల్ బస్తిల్లో రెండు ప్రాంతాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా ఐద్వా మహిళా సంఘం అధ్యక్షురాలు ఎం విజయ,జిల్లా నాయకురాలు డి ఇందిర హాజరై మాట్లాడుతూ... స్త్రీ సమానత్వం కోసం పోరాటం చేద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సదస్సు పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గౌరవంగా జీవించడం మన హక్కు అనే అంశం పాలకుల విధానాలు ఫలితంగా దేశవ్యాప్తంగా మహిళా పట్ల తీవ అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళల పట్ల వారు వేస్తున్న బట్టల పైన వారు ఈ సమాజంలో అర్ధరాత్రి ఒంటరిగా తిరగలేని పరిస్థితులు ఏర్పడ్డాయి మహిళల సమస్యల పైన ఎదుర్కొంటున్న అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారాలకే తప్ప ఆచరణలో సరైన హక్కులు భద్రత రిజర్వేషన్ కల్పన చేయట్లేదు.హక్కుల కోసం జరిగే పోరాటాలను అణిచి వేస్తున్నారు చెప్పారు .సమాజంలో మహిళలు బాలికలపై అనేక రకాల దౌర్జనాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు .పాలకులకు మహిళలు ఓట్లు వేసే యంత్రానలుగా ఉపయోగించుకుంటున్నారు విమర్శించారు. మహిళలకు అనుకూలంగా మాట్లాడి చేతుల్లో మొండి చేయి చూపిస్తున్నారని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇందుకు ఉదాహరణ అని గుర్తు చేశారు.విద్య వైద్య అందనీ ద్రాక్షగా మారిందన్నారు.సరైన పోస్ట్ ఆహారం లేక లక్షలాది మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలు కొన్ని విషయాలలో జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.ఇంటి నుంచి పిల్లలు సమాజం విలువలు ఒకరినొకరు గౌరవించుకునే లక్ష్యాన్ని పెంపొందించాలని చెప్పారు. అనంతరం శివరాంపల్లి ఐద్వా కమిటీ నూతన కమిటీ. ఎన్నుకోబడింది మహిళా అధ్యక్షులుగా ఎస్ అమరావతి కార్యదర్శిగా శ్రీలత. ట్రెజరర్ మాధవి. కమిటీ సభ్యులుగా పావని. జే అనిత. చిలకమ్మా నాగమణి అందాలు సరళ లలిత శ్రీలక్ష్మి వీరితోపాటు పదిమంది సభ్యుల ను ఎన్నుకోవడం జరిగింది.అదేవిధంగా రాజేంద్రనగర్ బుద్వేల్ లో మరొక ఐద్వా కమిటీ అధ్యక్షురాలుగా పార్వతి. కార్యదర్శిగా. జ్యోతి. కోశాధికారిగా సుహాని. కమిటీ సభ్యులుగా కృష్ణకుమారి. లలిత. ఈశ్వరి. నిహారిక. వీరితోపాటు ఆరు మంది కమిటీ సభ్యులుగా ఎదుర్కోవడం జరిగింది. ఈ కమిటీలు రాజేంద్రనగర్ మండల పరిధిలో ఉన్నటువంటి మహిళ హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ రామ్మోహన్రావు. సిఐటి రాజేంద్రనగర్ మండల నాయకులు ఎస్ మోహన్. మల్లేష్. మొగులయ్య. కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.




ఉద్యాన విశ్వవిద్యాలయం లో జరిగిన అంతర్జాతీయ వర్క్ షాప్ లో పాల్గొన్న డాక్టర్ దండ వాచిరెడ్డి డాక్టర్ ఎం ఎస్ రెడ్డి తదితరులు.

# నేల, మొక్కల ఆరోగ్యంపైనే భవిష్యత్ ఆహార భద్రత ఆధారపడి ఉంది

బుద్వేల్, మార్చి9(ప్రభాత ఉదయం): నేల, మొక్కల ఆరోగ్యంతోనే భవిష్యత్ ఆహార భద్రత, పోషక భద్రత ఆధారపడి ఉందని, కాబట్టి సహజ పద్ధతులకు ఆధునీకరణ జోడించి మొక్కల ఆరోగ్యాన్ని తద్వార మనుషుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉ ందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. రాజేం ద్రనగర్ లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వేధికగా ఆదివారం అమెరికాలోని అలభామ లో గల అబర్న్ యూనివర్శిటీ ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ తో కలసి సంయుక్తంగా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్వహించిన మొక్కల ఆరోగ్య, అహార సేఫ్టీ వర్క్ షాప్ కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పెరుగుతున్న జనాభ అవసరాలకు తగినట్లుగా ఉద్యాన పంటల ఉత్పత్తులను పెంచేందుకు గాను, అవసరమైన ఉత్పాదకత పెరగాలంటే సేంద్రీయ పద్దతులను పాటించాలన్నారు. ఆధునిక పరిశోధన ఫలితాలను మేళవించి సుస్థిర్ణ వ్యవసాయ పద్దతుల వైపు మారాల్సిన అవసరం ఉం దని వర్శిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ సదస్సులో మాట్లాడిన ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ ఫౌండర్ ఛైర్మన్ డాకర్ ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ. ప్రపంచ వ్యాప్త ంగా సురక్షిత ఆహారం ప్రాముఖ్యత పెరిగిందన్నారు. పరిశోధనలు అనేకం జరుగుతున్నప్పటికి అత్యంత కీలకమైన ప్రాధమికమైన పంటల ఆరోగ్యం పైన దృష్టి సారించాల్సిన అవసరం ఉం దన్నారు. రీజనరేటివ్ హర్టికల్చర్, నేచరల్ ఫార్మింగ్, సేంద్రీయ సాగు, సమగ్ర వ్యవసాయం, జీవన ఎరువుల వాడకం వంటి పద్ధతుల దిశగా పరిశోధనలు ముమ్మరం కావాలన్నారు. భారత దేశంలో పండే పంటల్లో రోగనిరోధక శక్తి చాలా బాగా ఉ ంటుందన్నారు. భవిష్యత్లో ఉద్యాన పం టల ఉత్పత్తుల ఆధారిత బిజినెస్ కు చాలా అవకాశాలు ఉన్నాయని డాక్టర్ ఎం.ఎస్ రెడ్డి చె ప్పారు. తెలంగాణ లోని వంటల ఆరోగ్యాన్ని సహజంగా పెంపొందించేందుకు అంతర్జాతీయ వర్క్షాప్ ఉపయోగపడతుందని వర్శిటీ అంతర్జాతీయ ప్రోగామ్ ల డైరెక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం. అమెరికాలోని ఏషియన్ పీజీపీఆర్ సొసైటీ కలసి త్వరలోనే సంయుక్త పరిశోదనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.భగవాన్, డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ, రాజేంద్రనగర్, మోజర్ల ఉద్యాన కళాశాలల అసోసియేట్ డీన్ లు డాక్టర్ పోతురాజు ప్రశాంత్, డాక్టర్ పిడిగెం సైదయ్య, కన్సల్టెంట్ డాక్టర్ వీరాంజనేయులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.








మహిళలతో బీజేపీ రాజేంద్రనగర్ నియోజక వర్గం నాయకుడు, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

# మహిళా శక్తి ఎంతో గొప్పది

**రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఉన్న మహిళలందరికీ ఎల్లవేళల అందుబాటులో ఉంటా : కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

బుద్వేల్, మార్చి 9(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న మహిళలందరికీ ఎల్లవేళలా అండగా ఉంటానని, ఏ అవసరం వచ్చినా ఒక 'అన్న' గా నిలబడతానని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకుడు, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాల్లో భాగంగా ఆదివారం మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని అరాంఘర్ చౌరస్తా న్యూ ప్రిన్స్ ప్యాలెస్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన "మహిళా దినోత్సవ సంబురాల్లో అయన మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజవర్గం నలుమూలల నుంచి తరలి వచ్చి నిర్వహిస్తున్న కార్యక్రమానికి తనను ముఖ్య అతిథిగా పిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు . మహిళలు తమ ప్రతిభ, నైపుణ్యాలతో దేశం లో అన్ని రంగాల్లో రాణించడం శుభ పరిమాణం అన్నారు. మహిళలందరూ అన్ని రంగాల్లో రాణించడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారాన్నారు. మహిళా శక్తి చాలా గొప్పదన్నారు. డివిజన్ మహిళ అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల నుంచి మాకు ఒక అన్నలా ప్రతి విషయంలోనూ మా తోడు ఉంటూ మా కోసమే ఈ మహిళా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్న మా శీనన్న కు అక్క చెల్లెలు ఆశీస్సుల నిండుగా ఉ ంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నాయకులు, అంగన్వాడీ, మహిళా గ్రూప్ ముఖ్య సభ్యులు స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు చదువుల తల్లి సావిత్రీ భాయి పూలే వర్ధంతి



చదువుల తల్లి సావిత్రీ బాయి పూలే



సావిత్రీ బాయి పూలే వర్ధంతికి రావాలంటూ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్‌ను కలిసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఉత్సవాల నిర్వాహకులు

బుద్వేల్, మార్చి9 (ప్రభాత ఉదయం) : ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు రాజేం ద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఆవరణలో చదువుల తల్లి సావిత్రీ భాయి పూలే వర్ధంతి ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల నిర్వాహణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు కె. క్రిష్ణమచారి, సభ్యులు కరణం యాదయ్య ముదిరాజ్, బండారి శంకర్, సుదాకర్లు తెలిపారు. సావిత్రీ భాయి పూలే వర్ధంతి కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు హాజరు కావాలన్నారు.

**నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో....**

రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు రాజేం ద్రనగర్ లో సావిత్రీభాయి పూలే వర్ధంతి ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు వేముల వెం కటేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్ లు ఓ ప్రకటనలో తెలిపారు. నవజ్యోతి యూత్ క్లబ్ సభ్యులందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



వేముల శ్రీనివాస్ ను సన్మానిస్తున్న శ్రీ వేంకటేశ్వర వడ్డెర సంఘం నాయకులు

# రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర వడ్డెర సంఘం అధ్యక్షునిగా వేముల శ్రీనివాస్

బుద్వేల్, మార్చి9(ప్రభాత ఉదయం): ప్రణాళిక బద్ధంగా వడ్డెర సంఘాన్ని అభివృద్ధి చేస్తానని రాజేంద్రనగర్ వడ్డెర సంఘం నూతన అధ్యక్షునిగా నియమితులైన వేముల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర వడ్డెర సంఘం కు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో సంఘం సభ్యులు వేముల శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకముంచి వడ్డెర సంఘం భాద్యతలు అప్పగించిన సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘంలోని ప్రతి సభ్యుని సహకారం, సూచనలు,సలహాలు తీసుకుని ముందుకు సాగుతానన్నారు. శ్రీ వెంకటేశ్వర వడ్డెర సంఘం ఉ పాధ్యక్షులుగా దుండగుల శ్రీనివాస్, వినోద్, ప్రధాన కార్యదర్శిగా గుంజ రాజు, కోశాధికారి రవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీను లు నియమితులైనారు. ఈ సమావేశంలో సంఘం పెద్దలు వేముల వెంకటేశ్, మాజీ అధ్యక్షులు కొమిరె గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



వేముల శ్రీనివాస్

### బండ్లగూడ జాగీర్‌లోని బేతేల్ పవర్ మినిస్ట్రీస్ చర్చ్‌లో

# మహిళా దినోత్సవం సందర్బంగా ప్రత్యేక ప్రార్థనలు



పాటలు పాడుతున్న బేతేలు పవర్ మినిస్ట్రీస్ చర్చ్ మహిళలు



పాస్టర్ హెబ్సీ భాస్కర్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు



సంఘంలో పెద్ద వారిని సన్మానిస్తున్న పాస్టర్ హెబ్సి భాస్కర్

బుద్వేల్, మార్చి 9 (ప్రభాత ఉదయం) : మహిళా దినోత్సవం సందర్భంగా గండిపేట మండలం బండ్లగూడ జాగిర్ ప్రాంతంలోని బేతేల్ పవర్ మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు . పాస్టర్ హెబ్సీ భాస్కర్ ఆధ్వర్యంలో ఈ ప్రార్తనలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ హెబ్సీ భాస్కర్ బైబిల్ సందేశాలను అందజేశారు. మిర్యాము లాంటి కూతురు, అబీ గయీలు లాంటి బార్య, యూనికే లాంటి తల్లి మాదిరిగా క్రైస్తవ మహిళలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ఉ న్న పెద్దలను పాస్టర్ హెబ్సి భాస్కర్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం చర్చిలోని మహిళలందరూ పాస్టర్ హెబ్సీ భాస్కర్ ను ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శభాకాంక్షలు తెలియజేశారు.

# రాందేవ్ రావు ఆస్పత్రిలో
# జర్నలిస్టులకు మెగా వైద్య శిబిరం

**జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్య రక్షణ అభినందనీయం**

**ఎమ్మెల్యే లు అరికేపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు**




కూకట్‌పల్లి, మార్చి 9 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి లోని రాందేవ్ రావు ఆసుపత్రిలో పాత్రికేయుల కుటుంబ సభ్యులకు ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పిఏ సి చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికేపూడి గాంధీ, కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, బీజేపీ కూకట్ పల్లి ఇంచార్జి మాధవరం కాంతారావు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరహత్ అలీ, జనసేన కూకట్ పల్లి ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమాకుమార్ లు వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ఉరుకులు పరుగులతో ఉండే జర్నలిస్టులు, వారి కుటుంబాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోని వైద్య పరీక్షలు చేయించడం అభినందనీయమని అన్నారు. రాందేవ్ రావు అస్పత్రి నిర్వాహకులు చేపట్టిన కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. జర్నలిస్టులు సమాజ భద్రత కోసమే పనిచేస్తే విలేకరుల ఆరోగ్యాల కోసమే రాందేవ్ రావు అస్పత్రి విలేకరుల కోసం పాటుపడుతుందన్నారు. క్యాంపు లో జరుగుతున్న పరీక్షల గురించి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, సీఈఓ డాక్టర్ యోబు లు వివరించారు. ఈ సందర్భంగా వివిధ రక్త పరీక్షలు, కిడ్నీ, గుండె, లివర్, షుగర్, ఎముకల పరీక్షలతో పాటు డైబెటిక్ నీరోపతీ, ఫుట్ హెల్త్ కేర్ పొడియటరీ, ఎముకల సాంద్రత, కళ్ల, డెంటల్ పరీక్షలు చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో సుమారు 300 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం వివిధ విభాగలకు చెందిన వైద్య నిపుణులు పరిశీలించి తగిన సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావ్ పరిశీలించారు. ఈ క్యాంపు లో విక్రందేవ్ రావు , మీరా రావ్ , ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావ్ లు పర్యవేక్షణ చేశారు. శిభిరాన్ని ప్రముఖ రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ క్యాంపు ని పరిశీలించి, ఆసుపత్రి అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమం లో టియుడబ్ల్యూజె మేడ్చెల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం ఏ కరీం, జర్నలిస్ట్ లు నవీన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, నాగరాజు, రాహుల్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



*సభలో మాట్లాడుతున్న జన సాహితి పత్రిక సంపాదకులు (విజయవాడ ) దివి కుమార్*

# మహిళలపై జరుగుతున్న సంఘటనలపై పోరాడాలి

హైదరాబాద్, మార్చి 9(ప్రభాత ఉదయం) ఆధిపత్య దోపిడీ శక్తుల ప్రయోజనాల కోసం పాలకులు అమలు చేస్తున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలు మహిళల జీవితాలను రోజురోజుకీ మరింత సంక్లిష్టం చేస్తూ, దుర్భర స్థితిలోకి నెడుతున్నాయని జన సాహితి పత్రిక సంపాదకులు దివి కుమార్ అన్నారు. ఆదివారం జనసాహితి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా నగరంలోని భాగ్ లింగంపల్లి లో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాల్‌లో శ్రీవిముక్తి సంఘటన అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జన సాహితి పత్రిక సంపాదకులు (విజయవాడ ) దినకర్ మాట్లాడుతూ... స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న ఆకాంక్షల్ని కాలరాస్తున్నాయి. తమ హక్కుల సాధన కోసం మహిళలు సంఘటిత పోరాటాలకు సిద్ధంకావలసిన అవసరాన్ని నేడున్న పరిస్థితులు ఎలుగెత్తి చాటుతున్నాయి. అందుకే ఈ సంక్షోభపు భారాల్ని మోస్తున్న మహిళలు సరైన చైతన్యంతో మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించటం తప్ప మరో మార్గం లేదు. మార్చి 8 పోరాట స్ఫూర్తితో పాలకులు పెంచి పోషిస్తున్న మతతత్వానికి, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని స్త్రీ విముక్తి సంఘటన పిలుపు నిచ్చింది. ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన ప్రతినిధి కరుణశ్రీ,డాక్టర్ ఆలూరి. విజయలక్ష్మి( సీనియర్ గైనకాలజిస్ట్), ప్రొఫెసర్ తోట. జ్యోతిరాణి, కాకతీయ యూనివర్శిటి శీలా సుభద్రాదేవి, రచయిత్రి ఎం. లక్ష్మి, ప్రధాన కార్యదర్శి, స్త్రీ విముక్తి సంఘటన డా. భట్టు. లక్ష్మీనారాయణ, అధ్యక్షులు, జనసాహితి జంటనగరాల శాఖ. తదితరులు పాల్గొన్నారు.



*అగ్రహారం కృష్ణానది వద్ద నీటి శుద్ధి ప్లాంట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి*

# పట్టణ ప్రజలకు శుద్ధి నీటిని అందించటానికి ప్రణాళికలు: ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**మంచినీటి శుద్ధి కేంద్రానికి భూమిపూజా చేసిన గద్వాల ఎమ్మెల్యే**

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 9(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణ ప్రజలకు శుద్ధినిటివి అందించటానికి ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టడానికి శ్రీకారం చుట్టడం జరిగిందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వ అమృత్ స్కీం లో భాగంగా 5 ఎం ఎల్ డి నిధులతో చేపట్టనున్న నీటి శుద్ధి నూతన మంచినీటి పథకానికి గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ...గద్వాల నియోజకవర్గం దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో నియోజకవర్గ ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండగా 40 సంవత్సరాల ముందు చూపును దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మంచినీటి సౌలభ్యం కోసం ఐదు కోట్లతో మంచినీటి శుద్ధి కేంద్రానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు.గద్వాల పట్టణానికి మంచినీరు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్యేశమని పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొళాయి ద్వారా నీరు అందించడం ముఖ్యోద్దేశం ఆన్నారు. ప్రస్తుతం గద్వాల పట్టణానికి 2 ఎమ్మెల్టీ ల నీరు అందుబాటులో ఉంది కొత్తగా పెరుగుతున్న పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 5 ఎమ్మెల్టీల మంచినీటిని అందుబాటులో కి తీసుకోనివచ్చి 40 సంవత్సరాల వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు .వేగంగా అభివృద్ధి చెందుతున్న గద్వాల పట్టణానికి ఎట్టి పరిస్థితిలో నీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా నిర్మించి ప్రతి ఇంటికి కొళాయి నీరు అందించడమే అంతిమ లక్ష్యమని అభివృద్ధిలో రాజి పడే సమస్యే లేదని తెలిపారు .ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్లు మురళి, దౌలు, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, నరహరి గౌడ్, శ్రీనివాసులు, నాయకులు అగ్రహారం ఆంజనేయులు, సాయి శ్యామ్ రెడ్డి, బంగి సుదర్శన్, ధర్మ నాయుడు, గంట రమేష్, రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్,గువ్వల గోపాల్, శ్రీనివాసులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



*వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానిస్తున్న నాయకులు*

# వివిధ రంగాలలో సేవలను అందిస్తున్న మహిళలకు సన్మాణం

బుద్వేల్, మార్చి9 (ప్రభాత ఉదయం) : వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన మహిళా మణులను ఆదివారం మానవ సేవే మాధవ సేవ సంస్థ, శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు. కాటేదాన్ పద్మశాలి ట్రస్ట్ భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సేవా భారతి మహిళలు, అంగన్వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మహిళా సిబ్బం ది. ఆశా వర్కర్లను సన్మానించి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కాశిగారి యాదగిరి, ఎర్వ కుమార స్వామీ, కొంపల్లి జగదీశ్, రమేశడ్డి, దొంత రాజు, సామల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల నిర్వహణలో శంషాబాద్ స్నేహ సంఘం పనితీరు బేష్

**అధ్యక్షురాలు దీప మల్లేష్‌కు బహుమతి ప్రదానం చేసిన సురేంద్రమోహన్**





శంషాబాద్,మార్చ్ 9.( ప్రభాత ఉదయం) సహకార సంఘాల నిర్వహణలో స్నేహ సహకార పరపతి సంఘం ఉత్తమ విధానాలతో స్ఫూర్తి వంతంగా నిలిచిందని తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ సురేంద్ర మోహన్ ( ఐఏఎస్) అభినందించారు. ఆదివారం హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కే సురేంద్ర మోహన్ ఉత్తమ సహకార సంఘం అధ్యక్షురాలుగ ఎంపికైన శంషాబాద్ స్నేహ మహిళ బ్యాంకు అధ్యక్షురాలు దీపా మల్లేష్ కు బహుమతి అందజేశారు. .సహకార సంఘాలకు స్ఫూర్తిగా స్నేహ సంఘం నిలుస్తుందని ఆయన ప్రశంసించారు . అనంతరం స్నేహ సహకార సంఘం అధ్యక్షురాలు బైరమోనీ దీప మల్లేష్ మాట్లాడుతూ... క్రమబద్ధమైన పొదుపు అలవర్చుకోవడమే కాకుండా అవసరమైన సందర్భాల్లో రుణాలు పొందేందుకు. ఉత్తమమైన అంశాల్లో డబ్బుని వినియోగించేందుకు సహకార సంఘాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. తమ సంఘం 23 సంవత్సరాలుగా చేస్తున్న కృషిని గుర్తించి బహుమతి అందజేయడం సంతోషకరమని అన్నారు.

# మదనాపురంలో కనీస సౌకర్యాలు కల్పించండి

**గతంలో రెండవ బాంబాయిగా ప్రసిద్ధి...నేడు కనీస సౌకర్యాలకు నోచుకోని దుస్థితి**

**బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



*మదనాపురం మండల కేంద్రంలో శ్రీ ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న యుగంధర్ గౌడ్*

కొత్తకోట, మార్చి 9(ప్రభాతవుదయం) మదనాపూర్ మండల ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాచాల చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమం ఆదివారం మదనాపూర్ మండల కేంద్రంలో ప్రారంభమైంది. శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక ప్రజలతో కలిసి సంత సాగే స్థలాన్ని, రైల్వే స్టేషన్, ఊకచెట్టు వాగు, మార్కెట్ యార్డు తదితర ప్రాంతాలను పరిశీలిస్తూ మార్నింగ్ వాక్ చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలనే ఏకైక లక్ష్యంతో మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టామన్నారు. పూర్వం రెండవ బొంబాయిగా ప్రసిద్ధి గాంచిన మదనాపూర్ నేడు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం బాధాకరమని అవేదన వ్యక్తం చేశారు.మండలంలో జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు వేరే ప్రాంతానికి వెళ్లి చదువుకోవటానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఊకచెట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో వచ్చే వర్షాకాలం ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. ఇక్కడి రైల్వే స్టేషన్ లో చాలవరకు ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగడం లేదని, ఈవిషయమై ఎన్నో సార్లు రైల్వే అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఏ ప్రయోజనం లేకుండా పోయిందని, ఈవిషయంపై స్థానిక ఎంపీ దృష్టి సారించి కేంద్ర ప్రభుత్వం, రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడి అన్ని రైళ్లు ఆగేలా కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలో ప్రత్యేకంగా సంతకు స్థలం కేటాయించకపోవడంతో రోడ్డుమీదనే అమ్మకాలు సాగిస్తున్నారని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని, సంత జరిగే సోమవారం రోజు బస్సులు లోపలికి వచ్చే అవకాశం లేకవడంతో బయట నుంచే వెళుతున్నాయని, దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరారు.మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడంతో ప్రజలు ఎండకు, వర్షానికి రోడ్డుమీద నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఉందని, ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు నిర్మించాలని, అప్పటివరకు కనీసం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం వాటికి స్వంత భవనాలు నిర్మించకుండా విస్మరించిందని, ప్రజా ప్రభుత్వంలో నైనా వీలైనంత త్వరగా వాటికి స్వంత భవనాలు నిర్మించాలని కోరారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, మార్కెట్ యార్డు స్థలం చాలా వరకు కబ్జాకు గురైందని, సరిహద్దుకు వెంటనే కంచె ఏర్పాటు చేసి కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఏనుకుంట రిజర్వాయర్ కింద చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, కాలువ మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షులు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, మండల అధ్యక్షులు మహేందర్ నాయుడు, కన్వీనర్ నరసింహ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కొన్నూరు గూడూషా, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ స్వప్న యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ రజక, నారాయణ పేట జిల్లా అధ్యక్షులు చిట్యాల లక్ష్మణ్, వనపర్తి పట్టణ అధ్యక్షులు దేవర శివ, పెద్దమందడి మండల అధ్యక్షులు రమేష్ సాగర్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు నాగరాజు యాదవ్, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్, అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షులు తెలుగు నాగరాజు,పెబ్బేరు గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మ్యాదరి రాజు, చెలిమిల్ల రామన్ గౌడ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం రంగారెడ్డి జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయండి

**జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్ కుమార్**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 9(ప్రభాత ఉదయం) టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి , కార్యదర్శి ప్రవీణ్ కుమార్ లు పిలుపునిచ్చారు.ఈ నెల 11 తేదీ(మంగళవారం ) శంకర్ పల్లి మండల పరిధిలోని పొద్దటూరు శివారులోని ప్రగతి రిసార్ట్స్ లో నిర్వహిస్తున్న జిల్లా రెండవ మహాసభకు మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కె శ్రీనివాస్ రెడ్డి ,మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మాజీద్ , సత్యనారాయణ, నగునూరి శేఖర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ కార్యదర్శి రాం నారాయణ లతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలోని జర్నలిస్టులు అందరూ మహాసభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదుకు జర్నలిస్టుల నుండి విశేష స్పందన వచ్చిందని పేర్కొన్నారు. జిల్లాలో 25 సంవత్సరాలకు పైగా విశేష సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఈ మహాసభల సందర్భంగా సన్మానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి జర్నలిస్టులు హాజరు కావాలని వారు కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608